### గుడిసెలను తొలగించడం అన్యాయం : నర్సింలు

**కంది, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములను కబ్జా చేసుకున్న వారిపై చర్యలకు వెనుకంజ వేసే ప్రభుత్వం పేదలు నివాసానికి గుడిసెలు వేసుకుంటే తొలగించడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నర్సింలు విచారం వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కందిలోని సర్వే నంబర్ 615లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై నిర్బంధాన్ని ఆపాలని భూ పర్యటన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజా సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగయ్య, వెకంటరాములు మాట్లాడుతూ రెవిన్యూ అధికారులు పేదల గుడిసెలను తొలగించడం సరికాదని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పేరుతో ఎకరాల కొద్ది కబ్జా చేసి కార్యాలయాన్ని నిర్మించినప్పుడు, పెత్తందార్లు ప్రభుత్వ భూ మిని కబ్జా చేస్తుంటే రెవిన్యూ అధికారులు ఎక్కడికి పోయారని నిలదీశారు. సిసిఎం జిల్లా కార్యదర్శి జి జయరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌చందర్, నరినసంలు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

### నేడు వెయ్యి పడకల ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొవరతో సిద్దిపేట అర్బన్ మండల పరిధి లోని ఎన్సాన్‌పల్లి శివారులో ప్రభుత్వ మెడికల్ కళాశాల అవరణలోనే అత్యాధునిక సౌకర్యాలతో, కార్పోరేట్ స్థాయిలో రూ.350 కోట్లతో వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ అసుపత్రిని నిర్మించారు. వెయ్యి పడకల అసుపత్రిని మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా ఈనెల 5న ప్రారంభించడానికి సంబంధితశాఖ అధికారులు సర్వం సిద్దం చేశారు. గాంధీ, ఉస్మానియా తరహాలో సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రి లోనే వైద్య సేవలు అందనున్నాయి. ప్రాణాంతకరమైన వైద్య చికిత్సలు కోసం ఇక నుంచి ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. గాంధీ, ఉస్మానియా తరహాలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. కిడ్నీ, కాన్సర్, గుండె సంబంధిత చికిత్సలు ఇక నుంచి సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రిలోనే చేస్తారు. మెడికల్ కళాశాల అనుబంధంగా ఉండడంతో సిద్దిపేటనే ప్రతి యేటా 175 మంది వైద్యులు అందుబాటులోకి రానున్నారు.వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసుకోవడం వైద్య మంత్రిగా గొప్ప సంతృప్తినిస్తుందన్నారు. రూ.7 కోట్లతో నిర్మించిన ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌ను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.



మంత్రి హరీష్‌రావు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## 7న ఆర్థిక మంత్రి హరీష్‌రావు పర్యటన

**-ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఈ నెల 7వ తారీఖున రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు జహీరాబాద్ నియోజకవర్గ పర్యటన చేయనున్న సందర్భంగా బుధవారం అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి పర్యటన ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అధికారులను ఆదేశించారు. హోతి(కె)లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణి సందర్బంగా నిర్వహించే సభతో పాటు పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో నిర్వహించే సభ కోసం అవసరమైన ఏర్పాట్లను చంద్రశేఖర్ పరిశీలించి అధికారులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకరెడ్డి, డిఎస్‌పి రఘు, ఎంపిడిఓ సుమతి, ఆత్మకమిటి చైర్మన్ పెంటరెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, న్యాల్‌కల్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ముస్నూర్ రవీందర్, కోహర్ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రవి కిరణ్, మాజీ కౌన్సిలర్ బండి మోహన్, నాయకులు ఇజ్రాయిల్ బాబి, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

## పాలకుల్లా కాదు సేవకులుగా సేవలందిస్తాం

**మైనంపల్లి హన్మంతరావు**



ఏడుపాయల్లో విలేఖరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంతరావు

**పాపన్నపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** పాలకులుగా కాకుండా సేవకులుగా ప్రజలకు సేవలందిస్తామని, ప్రజలు తమను ఆశీర్వదించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయాన్ని ఎమ్మెల్యే హన్మంతరావు తన కుమారుడు డాక్టర్ రోహిత్‌రావుతో కలిసి ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విలేఖరులతో హన్మంతరావు మాట్లాడుతూ మెతుకు సీమను అభివద్ది పర్చేందుకు సేవకుడిగా రోహిత్‌రావు వస్తున్నాడని, సీమ ప్రజల ఆశీర్వదించాలని వినతి చేశారు. 9 ఏండ్ల పాలనలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్ నియోజకవర్గానికి ఒరగబెట్టిం దేమిలేదని, జిల్లా కేంద్రంలోని కార్యాలయాలను సిద్దిపేటకు తరలించారని విచారం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలపై ఉన్న అభిమానం మెదక్ నియోజకవర్గంపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఏసిన హామీలు, దత్తత గ్రామాల బుఖ చిత్రాలు నేటికి మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్దిని విస్మరించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని మరో మారు ఓట్లు అడగడానికి వస్తున్నారని నిలదీశారు. రోహిత్‌రావుకు అవకా శం కల్పిస్తే అభివృద్దిలో దూసుకుపోతున్న సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లగా మెదక్‌ను మారుస్తామన్నారు. బిఆర్ఎస్‌లో మంత్రులకు, ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ లేదని మండిపడ్డారు. ఎంకంపల్లి నుంచి పాపన్నపేట వరకు నిర్మిస్తున్న రోడ్డు అర్థాంతరంగా ఆగిపోయి ఏండ్లు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. మెదక్ పట్టణానికి రింగ్ రోడ్డు హామి ఏమైందని నిలధీశారు. కోమటి చెరువులా పిట్లం చెరువు ఎప్పుడు మరుతుందని ప్రశ్నించారు. మహిళా శాసన సభ్యురాలిగా ఉంటూ మెదక్ నుంచి మహిళా కళాశాల తరలింపును ప్రోత్సాహించింది నిజం కాదా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. మైనంపల్లి రోహిత్ రావు పాపన్నపేటకు వస్తున్నట్లు తెలుసుకున్న యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి డీజే పాటలతో డప్పు దరువులతో నృత్యాలు చేస్తూ స్వాగతం పలికి ఏడుపాయల రాజగోపురం వద్ద గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ అధ్య క్షులు ప్రశాంత్‌రెడ్డి, కొత్తపల్లి సహకార సంఘం అధ్యక్షులు త్యార్ల రమేష్ గుప్తా, మక్కంపేట సర్పంచ్ బాపురెడ్డి, ఆర్కెల ఎంపిటిసి సభ్యులు మానిక్ రాజు, బచరం ఎంపిటిసి ఆలమణి, నరేందర్‌గౌడ్, సత్యగౌడ్, జనార్ధన్‌రెడ్డి, ఆవుల గోపాల్‌రెడ్డి, సుప్రభాతరావు, గంగ నరేందర్, జీవన్‌రావు, కొండన్ సురేందర్‌గౌడ్, రవీందర్ గుప్తా, భారత్‌గౌడ్, డీలర్ శ్రీనివాస్, పర్వా నర్సింలు, జీవన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిరంతరం కృషి చేస్తా

**-మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**సదాశివపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో అభివృద్దికి నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్ అన్నారు. పట్టణంలోన 16వ వార్డులో 21.50 లక్షలతో కమ్యూనిటీ భవనం, సిద్దాపూర్ కాలనీలో దోబిఘాట్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులకు 2 కోట్ల రూపాయలు మంజూరు కాగా పనుల నిర్మాణానికి బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ది పనులకు శ్రీకారం చుడుతున్న దృశ్యం

# అడ్డగోలుగా అక్రమ మొరం వ్యాపారం?

## అర్ధరాత్రుల్లో గుట్టలో తవ్వకాలు.. టిప్పర్లలో రవాణా



పోలీసులు సీజ్ చేసిన మొరం టిప్పర్

**జోగిపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గృహనిర్మాణాలు చేయాల్సి ఉండటంతో, అందుకణుగుణంగా వెంచర్లు వెలుస్తున్నాయి. చెరువులు, కుంటల కింద ఉన్న భూములు, నల్లరేగడి భూములను వెంచర్లుగా మారుస్తుండటంతో, వాటిని గృహనిర్మాణాలకు అనుగునంగా తయారుచేసేందుకు మొరం అవసరం బాగా పెరిగింది. కేవలం వెంచర్లలోకి మాత్రమేకాకుండా భవన నిర్మాణాలు చేసుకునేవారుకూడా మొరంనింపుతుండటంతో మొరం గిరాకీ భాగా పెరిగింది. దీంతో అక్రమ మొరం వ్యాపారం ఆరంభమైంది. అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఈ మొరం అక్రమవ్యాపారం మూడుపూవుల ఆరుకాయలుగా సాగుతున్నది. వివరాల్లోకి వెళితే..

అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఇటీవలికాలంలో నూతన వెంచర్లు వెలుస్తుండటం, నూతన భవన నిర్మాణాలు బాగా జరుగుతుండటంతో మొరంకు డిమాండు బాగా పెరిగింది. ఒక్కటిప్పర్ మొరంను సుమారు రూ.5500లవరకు అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారు. మున్సిపల్ పరిధిలోని 1141 సర్వేనెంబరులో అందోలు సమీపంలోని గుట్ట ప్రాంతంలోనుంచి అర్ధరాత్రుల్లో మొరంత తవ్వకాలు జరిపి, అవసరం ఉన్నవారికి అమ్ముకుంటున్నారు. పెద్దఎత్తున ఈ చీకటివ్యాపారం సాగుతున్నాకూడా, ఈ విషయంలో ఎవరూ పట్టించుకోవటంలేదు. మొరం తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం పెద్ద గోతులు ఏర్పడి, మైనింగ్‌చేసే ప్రాంతంలా తయారయింది.

### జాతీయ రహదారికి అనుమతితో అక్రమమొరం వ్యాపారం ఆరంభం

సంగారెడ్డి నుంచి నేరెడిగుంట వరకు నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి అవసరం నిమిత్తం అందోలులోని 1141 సర్వే నెంబరు, తిరుమలాయ గుట్టలో సదరు కాంట్రాక్టరు మొరం తవ్వకాలకు అనుమతులు పొంది, ఇక్కడ మొరం తవ్వకాలు చేపట్టడంతో, ఇక్కడ అక్రమమొరం వ్యాపారానికి తెరలేచింది. జాతీయ రహదారికోసం మొరం తవ్వకాలు చేసిన సందర్భంలోనూ అనుమతులు తీసుకున్నమేరకు మించి ఇక్కడ మొరం తవ్వకాలు చేశారన్న ఆరోపణలున్నాయి. దీనిని అదునుగా చేసుకున్న అందోలుకు చెందిన కొందరు మొరం వ్యాపారాన్ని ఆరంభించి అడ్డగోలుగా సంపాదించుకుంటున్నారు.

### అర్ధరాత్రుల్లో మొరం అక్రమ తవ్వకాలు రవాణా

మొరంకు డిమాండు బాగా పెరగటంతో ఇక్కడ ఈ అక్రమ వ్యాపారం చేస్తున్న వారు అన్నిరకాలుగా అందరినీ మచ్చికచేసుకుని ఏ అడ్డంకులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలుచేసి రవాణా చేస్తున్నారు. ముఖ్యంగా అందోలుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్త కనుసన్నల్లో ప్రస్తుతం ఈ అక్రమ మొరం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుంది. జరిమానాలు వేసినా, కేసులు నమోదు చేసినాకూడా ఈ అక్రమ మొరం వ్యాపారం మాత్రం ఆగటంలేదు. ఈ విషయంలో ఇటీవలే వినాయకచవితినాడు మున్సిపల్ కౌన్సిలర్ల భర్తలు స్వయానా కావలికాచి అక్రమం మొరం రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించటంతో, దానిని సీజ్ చేసి కేసునమోదు చేశారు. ఈ సంఘటన జరిగి రెండు వారాలుకూడా గడవకముందే మూడు రోజులక్రితం మళ్లీ జోగిపేటలోని ఓ వెంచర్లోకి అర్ధరాత్రి మొరం తలించారు. అంటే మొరం వ్యాపారంలో ఏమేరకు లాభాలు గడిస్తున్నారో అర్థమైపోతుంది.

### అనుమతిలేకుండా మొరం తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు: ఆర్డీవో పాండు

అందోలులో ఎక్కడ అనుమతిలేకుండా మొరం తవ్వకాలు జరిపినా కఠినచర్యలు తీసుకుంటాం. ఈ విషయం ఇటీవలే తమ దృష్టికిరాగా జోగిపేట సిఐకి సమాచారం ఇచ్చాం. అనుమతులు లేకుండా ఎవరు మొరం తవ్వకాలుచేసి తరలించినా వాటిని సీజ్ చేయాలని ఆదేశించాము. మొరం కావాలనుకున్నవారు ముందుగా అనుమతులు పొందాలి. ఈ విషయమై ఎక్కడ అక్రమంగా మొరం తవ్వకాలు జరిపినా తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

## గొర్రెల యూనిట్లన్న ఇప్పించండి లేదా

# డీడీలన్న తిరిగి ఇవ్వండి

**గొర్రెల యూనిట్లు రాక గోస పడుతున్న గొల్లకుర్మలు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా వర్గల్ మండల పరిధిలోని గొల్లకుర్మలు గొర్రెల కోసం డీడీలు కట్టి నెలలు గడిచిపోతున్న నేటికి గొర్రెలు పంపిణీ చేయడం లేదని వర్గల్ జడ్పీటిసి సభ్యులు బాలమల్లు యాదవ్ అవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ గొర్రెల కోసం డీడీలు చెల్లించిన లబ్దిదారులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని లేదంటే డీడీలు తిరిగి ఇవ్వాలని కోరారు. సిద్దిపేట రూరల్ జడ్పీటిసి శ్రీహరి మాట్లాడుతూ మండలంలో ఎంత మందికి ఎన్ని గ్రామాలకు గొర్రెల యూనిట్లు మంజూరు వచ్చాయో వివరాలను అందించాలన్నారు. మద్దూరు జడ్పీటిసి సభ్యులు గిరికొండల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో లబ్ధిదారులకు అందించే ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ఎవరూ చెప్పడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. మండలానికి మంజూరు వచ్చే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాలను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్దూరు మండల అభివృద్దిని ఎవరూ పట్టించుకున్న పాపానపోవడం లేదన్నారు. మండలంలోని పలు సమస్యలను సర్వసభ్య సమావేశంలో ఎన్ని మార్లు మొరపెట్టుకున్న ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. చేర్యాల పిఎసిఎస్‌లో కోట్లాది రూపాయాల అవినీతి జరిగిన చర్యలు తీసుకున్న పాపానపోలేదన్నారు. రేషన్ కార్డులను వెంటనే ఇపి ్పంచే విధంగా అధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్గల్ ఎంపిపి, బెజ్జంకి జడ్పీటిసి, మిరుదొడ్డి ఎంపిపి, కొము రవెల్లి జడ్పీటిసి తదితర సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకవచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ మాట్లాడుతూ మంత్రి హరీష్‌రావు ప్రతే ్యక కృషితో జిల్లాను అన్ని రంగాలల్లో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. రూ.300 కోట్లతో అయిల్‌ఫామ్ కర్మాగారం నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు మాట్లాడారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, జడ్పీటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ



ఎంపిక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

## పూదరి వరప్రసాద్‌కు సర్వాయి పాపన్న అవార్డు

**హుస్నాబాద్, అక్టోబరు4, ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణానికిక చెందిన గీతా పారిశ్రామిక సంఘం అధ్యక్షులు పూదరి వరప్రసాద్‌గౌడ్‌ను సర్దార్ సర్వాయి పాపన్న జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షులు నల్లా రధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రోజున హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జాతీయ అవార్డు గ్రహిత వరప్రసాద్‌కు ఎంపిక పత్రాన్ని అందజేశారు. మొగల్ చక్రవర్తుల ఆకృత్యాలను ఎదిరించి, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన తొలి యోదుడు సర్వాయి పాపన్న స్పూర్తితో వరప్రసాద్ గీత కార్మికుల అభివృద్ది కోసం పాటుపడుతున్నం దున ఆయనను గుర్తించి జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ అవార్డును వచ్చే నెల 15వ తేదీన ఢిల్లీలో బహూకరించనున్నట్లు తెలిపారు.

### 6న జాబ్ మేళా: జిల్లా ఉపాధి అధికారి వందన

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఈ నెల 6వ తారీఖున జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి వందన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మి మార్కెటింగ్‌లో 4 ఉద్యోగాల భర్తీకి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల పాత వెలుగు కార్యాలయంలోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో మళాను నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వయసు లోపు వారు, ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ విద్యను అందుకున్న వారు ఉద్యోగా లకు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు 10వేల రూపాయలను అందిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6న నిర్ణీత సమయానికి తమ విద్యార్హ పత్రాలు, ఆధా ర్‌కార్డు, కుల ధృవీకరణ పాత్రాల జిరాక్సు పత్రాలతో చేరుకుని మేళాలో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు 08455- 271010 ను సంప్రదించాలని వందన పేర్కొన్నారు.

### కుటుంబకలహాలతో హోంగార్డు ఆత్మహత్య

**హుస్నాబాద్, అక్టోబరు4, ప్రభాతవార్త** హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గత కొన్ని ఏళ్ళుగా విధులు నిర్వర్తిస్తున ్న హోంగార్డు దేవసాని మ ల్లారెడ్డి మంగళవారం రాత్రి తన స్వగ్రామమైన పొట్లపల్లి గ్రామంలో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణంలో తన విధులు ముగించుకుని తన స్వగ్రామమైన పొట్లపల్లి గ్రామానికి చేరకుని తన ఇంట్లో ఉరిపోసుకున్నాడు. ఈ సంఘటనకు కుటుంబకటహాలు కారణమని ప్రాథమిక సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



గజ్వేల్‌లో సింహగర్జన ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు

# ఓట్లు మావి సీట్లు మీకా..

**చట్టసభల్లో ముదిరాజ్‌లకు అధిక ప్రాధాన్యత కల్పించాలి**

**గజ్వేల్‌లో గర్జించిన ముదిరాజ్ సింహగర్జన ర్యాలీ**

**గజ్వేల్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** చట్టసభల్లో ఆనాదిగా ముదిరాజులకు అన్యాయం జరుగుతుందని, ముదిరాజ్‌లకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గజ్వేల్‌లో ముదిరాజ్‌లు సింహగర్జన ర్యాలీ నిర్వహించారు. ఐఓసి పక్కన గల మైదానం నుండి వర్గల్ కమాన్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా, ప్రజ్ఞాపూర్ చౌరాస్త వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ముదిరాజ్ యువసేన ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, పిట్ల నగేష్, బైరి శంకర్, పిట్ల ఆంజనేయులు, లింగాల యాదగిరి, రమేష్, భీమ లక్ష్మణ్, నారాయణ, పడిగె ప్రశాంత్, మిట్టపల్లి శ్రీనివాస్, తొడంగి నవీన్, పుల్లూరు సుధాకర్‌లు మాట్లాడుతూ స్వాతంత్రం ఏర్పడ్డ నాటి నుండి ముదిరాజులకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వడంలేదని మండిపడ్డారు. చట్టసభల్లో రావాల్సిన రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించకుండా ఓట్లు వేయించుకొని రాజకీయ పార్టీలు గద్దెనెక్కుతున్నాయన్నారు. ముదిరాజ్ బిడ్డలకు అన్ని విషయాలలో అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువకునికి మత్స్యకార సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని, అంతేకాకుండా ముదిరాజ్‌లను బిసి-డి నుండి బిసి-ఏలో చేర్చాలని డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా డిమాండ్ ఉన్న ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుంటున్నారన్నారు. వచ్చే శాసనసభ పార్లమెంట్ ఎన్నికల్లో ముదిరాజ్‌ల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. అధికారం వచ్చే వరకు ముదిరాజ్‌ల ఓట్ల వెంబడి రాజకీయ పార్టీలు తిరుగుతూ అధికారం వచ్చాక పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ముదిరాజ్‌ల సమస్యలు తీర్చేంత వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు మల్లేశం, గుంటుకు రామస్వామి, ప్రజ్ఞాపూర్ అధ్యక్షుడు రొట్టెల శ్రీనివాస్, మర్కంటి పోచయ్య, గణేష్, అశోక్, కనకయ్య, రాగుల రాజు, హేమ సురేష్, మహిళా అధ్యక్షురాలు జయమ్మ, వెంకటేశం, దేవగనిక నాగరాజు, శ్రీకాంత్, గణేష్, మన్నె శ్రీనివాస్, రాజు, సుదర్శన్, ఎంపిటిసిలు నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతతో పనిచేస్తున్నాం.. భద్రత కల్పించండి

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు, డిపిఎంలు బాధ్యతాయుతంగా తమ పనిని నిర్వహిస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిద్దిపేట జిల్లా ఈ-పంచాయతీ టెక్నికల్ వింగ్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం పక్కన జిల్లా ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లతో కలిసి శాంతియుతంగా సమ్మె నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1617 మంది ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నామని, ప్రతి ఆపరేటర్‌కు 6 నుండి 10 గ్రామపంచాయతీలు ఉన్నాయని, ఆ గ్రామపంచాయతీలకు సంబంధించిన లావాదేవీలను మరియు జనన, మరణ వివరాలను అంతర్జాలంలో పొందుపరుస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నామని, గ్రామపంచాయతీకి సంబంధించిన ఇంటి పన్నులను అంతర్జాలంలో పొందుపర్చడమే కాకుండా భవన నిర్మాణ అనుమతులు, లేఔట్ అనుమతులను అంతర్జాలం ద్వారా అందిస్తున్నామని అన్నారు. గత ఎన్నికలకు సంబంధించిన ప్రతి పని తామే చేశామని, అలాంటి తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పేస్కేల్ అమలుపర్చాలని, అదేవిధంగా మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కల్పించాలని, ఉద్యోగంలో ఎవరైనా ఆపరేటర్ మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు తమను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ-పంచాయతీ సంఘం గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బరిగె నర్సింలు, కోశాధికారి సంతోష్‌కుమార్, మహిళా నాయకులు చాలిక, ప్రసన్న, శ్యామల, సమత, కవిత, ఆపరేటర్లు శేఖర్, నాగరాజు, మహేష్, నర్సింలు, సతీష్, శ్రావణ్, మన్సన్, ఎల్లయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట కలెక్టరేట్ వద్ద సమ్మె నిర్వహిస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు



## మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ

**సదాశివపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** పట్టణంలోని రేసన్ దుకాణం 5లలలో మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ అందచేశారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి సంక్షేమాన్ని కాంక్షిస్తూ బిఆర్ఎస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. భారత దేశంలోనే మరే రాష్ట్రంలో అమలు కాని పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పిల్లోడు జయమ్మ, వైస్ చైర్మన్ చింత గోపాల్, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, ఇంద్రమోహన్‌గౌడ్, విద్యాసాగర్, రవి కుమార్, శివ, కో-ఆప్షన్ సభ్యులు అంజయ్య, సమ్మి, జున్ను, మోబిన్, నజీరర్ తదితరులు పాల్గొన్నారు.

### మైనంపల్లి కోసం సైకిల్ యాత్ర

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** మైనంపల్లి హనుమంతరావు, మైనంపల్లి స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌రావుపై అభిమానంతో చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామానికి చెందిన కోమరయ్య వారిని కలుసుకోవడానికి తన సైకిల్‌పై 30 కిలోమిటర్ల దూరంలోని ఏడుపాయల వద్దకు చేరుకున్నారు. అతని అభిమానాన్ని చూ సిన మైనంపల్లి హనుమంతరావు అలింగనం చేసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రోహిత్‌ను గెలిపించుకుంటామని ఆయన తెలిపారు. సైకిల్‌పై వచ్చిన కోమరయ్యను అభినందించారు.



ఏడుపాయలలో మైనంపల్లి హనుమంతరావుతో కోమరయ్య



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

## బతుకమ్మ చీరలు పంపిణీ

**అమీన్‌పూర్, అక్టోబర్4 ప్రభాతవార్త:** ఆడబిడ్డలు బతుకమ్మ పండుగ సంబరంగా జరుపుకోవాలని సీఎం కేసీఆర్ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ కమీషనర్ జ్యోతిరెడ్డి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆడపడుచులకు ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలు పంపించడం జరుగుతుందని తెలిపారు. దీంతో చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పన ఉపేందర్‌రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, బిజిలి రాజు నవనీత, జగదీషన, కవిత శ్రీనివాస్‌రెడ్డి, బోయిని బాలమణి బాలరాజు, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, యూనస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శేఖర్, కొల్లూరు యాదగిరి, చౌటకూరు మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యం

**-డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్**



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్

**కొల్చారం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ తెలిపారు. బుధవారం రంగంపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో రైతులతో కలిసి మహాసభ కార్యక్రమాన్ని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సభలో గత సంవత్సర కాలంగా నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వివరాలను సీఈవో నవీన్ సభ ముందు చదివి వినిపించారు. ఈ సందర్భంగా అరిగె రమేష్ కుమార్ మాట్లాడుతూ రైతును రాజు చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని, సంఘం పరిధిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల అమ్మకాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో నవీన్ యాదవ్, బీరప్ప, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, డైరెక్టర్ సంగమేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, రైతులు కాశీ, భూపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సిబ్బంది, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**వెల్దుర్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** మండలకేంద్రంలో బుధవారం న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ అమలుచేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, 65 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు రిటైర్మెంట్‌ను తగ్గించాలన్నారు. న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున తాము అండగా ఉంటామని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిషన్, మహేందర్, ఆంజనేయులు, రాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## తపాలా శాఖ ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** తపాలా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పెద్దశంకరంపేట తపాలా శాఖ కార్యాలయం ముందు బుధవారం ఉద్యోగులు ఒక్క రోజు సమ్మె చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కమలేష్ చంద్ర సిఫార్సులను అమలు చేయాలని, తపాలా శాఖ ఉద్యోగులకు 8 గంటల పని కల్పించాలని, వేతనాలు పెంచాలని పేర్కొన్నారు. తపాలా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దశంకరంపేట మండల బీపీఎంలు, సిబ్బంది మాణయ్య, గంగారాం, రాఘవేందర్, నెహ్రు, బీరప్ప, ప్రశాంత్, తుకారాం, సవిత పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ 104 ఉద్యోగుల సమ్మె

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** సమస్యలు పరిష్కరించాలంటూ 104 ఉద్యోగుల సమ్మెచేస్తున్నారు. రాష్ట్రంలో 104 ఉద్యోగులు 2008 సంవత్సరం నుండి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పద్ధతిలో జీవో నెం.1636, ఎంఈఎంవో నెం.20639 ల ప్రకారం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే మొత్తం 1350 మంది విధులు నిర్వహిస్తున్నట్లు వారు బుధవారం తెలిపారు. గత 15 సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత లేకుండా చాలీ చాలని వేతనాలతో సేవలు అందిస్తున్నామని, మా ప్రధాన డిమాండ్ రెగ్యులర్ కావడానికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. వెంటనే రెగ్యులర్ చేయాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలన్నారు. డేటా ఎంట్రా ఆపరేటర్‌లను కంప్యూటర్ ఆపరేటర్‌గా మార్చాలన్నారు.



సమ్మె చేస్తున్న 104 ఉద్యోగులు

# బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం అభినందనీయం

**ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల**



మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల

**కొల్చారం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి బతుకమ్మ చీరలు, స్పోర్ట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం అభినందనీయమని ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాలలు తెలిపారు. బుధవారం బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్‌లను కొల్చారం రైతు వేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాలలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగకు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ఎంతో గొప్ప పథకమని తెలిపారు. అలాగే యువకులు క్రీడా మైదానల్లో ఆటలు ఆడుకునేందుకు స్పోర్ట్స్ కిట్స్ అందజేయడం ఎంతో శుభపరిణామం అన్నారు. యువకులు క్రీడలతో పాటు విద్యలో కూడా ముందుండాలని పేర్కొన్నారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామగ్రామాన క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నారని, తెలంగాణ ఏర్పాటు తరువాతర ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. అంతకుముందు గత వారం రోజుల క్రితం రంగంపేట జిల్లా పరిషత్ ఉపాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీలకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానం అందలేదని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, తహశీల్దార్ గఫార్ మియా, మండల ప్రత్యేక అధికారి నాగరాజు, కారోబార్ వడ్ల ప్రభాకర్, మండల ప్రజాపరిషత్ సూపరింటిండెంట్ విఠల్ నాయక్, జూనియర్ అసిస్టెంట్ రాకేష్‌గౌడ్, ఏపీవో మైపాల్ రెడ్డి, సర్పంచులు ఉమా రాజాగౌడ్, నాయకులు సందీప్, చలం యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్, కాశీనాథ్, పోచయ్య, రాంరెడ్డి, ఆది నాగేశ్వరరావు, సురేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంజనేయుల, సర్పంచులు కుకునూరి మంజుల సత్యనారాయణగౌడ్, పాశం మానస శ్రీనివాస్‌రెడ్డి, తిరుణగారి గోదావరి వెంకట రాములు, కరెంట్ ఉమా రాజాగౌడ్, జిల్లా క్రీడల అధికారి నాగరాజు, ఎంపీవో లక్ష్మీనర్సింలు, ఎంఎటీసీ ఆదాం, ఆయా గ్రామాల సర్పంచుల, ఎంపీటీసీలు, పలువురు అధికారులు, మహిళలు, యువకులు, క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశంగౌడ్, ఆవుల రాజిరెడ్డి

## ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి**

**కొల్చారం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** ఆదర్శమైన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ చాలీచాలని వేతనంతో జీవనాన్ని వెల్లదీస్తున్న ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కొల్చారంలోని బస్టాండ్ ఆవరణలో ఆశావర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెల 10వ రోజుకు చేరుకుంది. సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు రాజిరెడ్డి నగదును అందజేశారు. అనంతరం మల్లేశంగౌడ్‌తో పాటు ఆశా వర్కర్లు మాట్లాడుతూ మా న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ఆదర్శమైన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించక పోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, గోవర్దన్, అనిల్, అక్రమ్, యేసు, రాజు, బాల్‌రాజు, విఠల్‌గౌడ్, ఆగంగౌడ్, శంకర్ నాయక్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ అసెంబ్లీ ఓటరు తుది జాబితా విడుదల

**కొడంగల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గం-72 ఓటరు తుది జబితాను విడుదల చేయడం జరిగిం దని, బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓ) దగ్గర ఓటరు జాబితాలో పేర్లను పరిశీలిం చుకోవాలని అసెంబ్లీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్ బి.విజ యకుమార్ తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో కొత్తగా 10,835 మంది ఓటర్లు నమోదైయ్యారని చెప్పారు. నియో జకవర్గంలో మొత్తం ఓటర్లు 2,30,251 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 1,14,140 మంది పురుషులు, 1,16,099 మంది మహిళా ఓటర్లతో పాటు ఇతరులు 12 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో పనిచేస్తున్న బూత్ లెవల్ అధికారుల దగ్గర తుది ఓటరు జాబితా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారుల దగ్గర ఉన్న ఓటరు జాబితాలో ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బొంరాస్ పేట్, దుద్యాల, దౌల్తాబాద్ తహశీల్దార్‌లు వెంకటేష్, అనంద్‌రావు, విజయ్ కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ ఎం.శివకుమార్, డిప్యూటీ తహశీ ల్దార్ సురే ష్‌కుమార్‌లతో పాటు అఖిలపక్షం నాయకులు ఆర్.మోహన్‌రావు, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, సీపీఐ నాయకులు శ్యాసుందర్, సయ్యద్

## ప్రధానమంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి క్షీరాభిషేకం

**మేడ్చల్, అక్టోబర్ 4 ప్రభాతార్త :** రాష్ట్రానికి గిరిజన కేంద్రీయ విశ్వ విద్యాలయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడి ప్రకటించి మంజూరి చేయడంతో పాటు విశ్వవిద్యాలయానికి గిరిజన వనదేవతలు సమ్మక్క సారలమ్మ పేరుతో నామకరణం చేసినందుకుగాను ఆయన చిత్రపటానికి బిజెపి నాయకులు పాలాభిషేకం నిర్వయించారు. కార్యక్రమంలో బిజెపి మండల గిరిజన మోర్చ అధ్యక్షుడు గోపి నాయక్, బిజెపి మేడ్చల్ అసెంబ్లి కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, అంజనేయులు, పోచయ్య, సునీత, సుధాకర్‌నాయక్, వెంకటేష్‌నాయక్, విజయ్‌నాయక్, వినోద్‌నాయక్, రతన్ రాథోడ్ నాయక్, నర్సింహనాయక్, రాజు నాయక్, రవి నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి

**శంషాబాద్ అక్టోబర్4, ప్రభాతవార్త :** దివంగత నేత పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని ఆయన కుమారుడు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామం వద్ద ఆయన తుదిశ్వాస వదిలిన చోట నిర్మించిన విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. శంషాబాద్ మాజీ ఎంపిపి చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ , స్థానిక సొసైటీ చైర్మన్ శ్రావణ్ కుమార్ గౌడ్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి పథంలో నడపడం కోసం ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. యువతకు ఉద్యోగాలు ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం కోసం కృషి చేస్తానని అన్నారు. ఇంద్రారెడ్డి జీవించి ఉంటే ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యేవారు అని చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ పేర్కొన్నారు. ఆయన అకాల మరణంతో జిల్లా ప్రజలు ఎనలేని భవిష్యత్తు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

**-టిపిసిసి ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్**

**నందిగామ అక్టోబర్4, ప్రభాతవార్త :**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని కార్యకర్తలు సైనికులవలే పని చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నందిగామ మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటికి కాంగ్రెస్ కార్యాక్రమంలో సోనియా గాంధీ ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడగానే 6 సంక్షేమ పథకాలు అమల్లోకి వస్తాయని అన్నారు. అంతకుముందు మోత్కులగూడ గ్రామానికి చెందిన 50మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చెరినట్లు వీర్లపల్లి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎ మండలానికి వెళ్లిన , ఏ ఊరుకువెళ్లిన కాంగ్రెస్ 6 పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతుండటం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో కాం గ్రెస్ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, బి.చంద్రాపాల్ రెడ్డి, దేపల్లే కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిలెలల రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బి.జంగయ్య గౌడ్, బి.కృష్ణారెడ్డి, బొమ్మగల నర్సింలు, తడకల జంగయ్య, పిట్టెల రాములు, చిల్కమారి నర్సింలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## బిసిలు సంఘిటితం కావాలి ..హక్కును సాధించాలి

**తాండూర్ టౌన్ అక్టోబర్4, ప్రభాతవార్త :**

బిసిలు సంఘిటితం కావాలని హక్కును సాధించుకోవాలని బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ పేర్కొన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని ప్రగతి కోచింగ్ సెంట్ ప్రాంగణంలోని బిసి జేఏసి మండల మరియు కళాశాలల కమిటీల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ హాజరై మాట్లాడుతూ.... దేశంలో పులుల, ఆవుల ,సంఖ్యల ఘనంకాలు ఉన్నాయి కానీ జనాబాలో మెజార్టీగా ఉన్న బిసి కులాల గణన శాతబ్దికాలం గడుస్తున్న ఈ ప్రభుత్వాలు కుల గణన చేయకపోవడం చాలా భాదకరం అని కేంద్ర ప్రభుత్వంలో బిసి అని చెప్పుకునే ప్రధాని తక్షణమే బీహార్ రాష్ట్రం తరహాలో జన గణనతో పాటు కుల గణన చేపట్టి ఆయన చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చట్టసభలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం బిసిలందరిని ఏకం చేయాలని చట్టసభలో బిసి రిజర్వేషన్ అమలు చేయాలని బిసిల కులగణన చేపట్టాలని తెలంగాణ బిసి జేఏసి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వర్త నేషనల్ పీపుల్‌నస ఫ్రండ్ చైర్మన్ నారగోని , జిల్లా ప్రెసిడెంట్ మైల్వార్ రాము గౌడ్, తాండూరు పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, వివిధ మండల అధ్యక్షులు లక్ష్మణ్, ఇస్మాయిల్, రాజు, సత్యనారాయణ, వివిధ కళాశాలల అధ్యక్షులు విజయ్, మహేష్, సమ్మీర్, రహమాన్, సతీష్ గౌడ్, అనిల్ కుమార్, సాయి కుమార్, అశోక్, వంశీ కృష్ణ, బావని ప్రసాద్, నందు, పవన్, హర్షవర్ధన్, నరేష్, శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు విజయ్, బాలు, చందు, పాల్గన్నారు.

## యువతకు ప్రభుత్వం పెద్దపీట

**శంకర్‌పల్లి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:**

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శంకర్‌పల్లిలో రూర్బన్ నిధులతో రూ.1.80 కోట్లతో నిర్మించిన ఆడిటోరియంను, మోకిల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి కెసిఆర్‌ను అధికారంలోకి తీసుకురావాలని కోరారు. సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపిపి గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయ లక్ష్మి ప్రవీణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీందర్ గౌడ్, సర్పంచ్‌లు శ్రీనివాస్, నరసింహారెడ్డి, సత్యనా రాయణరెడ్డి, ఎంపిటిసిలు సరిత, వెంకటరెడ్డి, కౌన్సిలర్లు శ్వేతా పాండురంగారెడ్డి, లక్ష్మమ్మ రాంరెడ్డి, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, పాల్గొన్నారు.

## ఆశాలకు కరువైన ప్రభుత్వ ఆశీర్వాదాలు

**-నందిగామలో బిక్షాటన చేసిన ఆశావర్కర్లు**

**నందిగామ అక్టోబర్4, ప్రభాతవార్త :** పనికి తగిన వేతనం అమ లు పరుస్తూ ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాం డ్ చేస్తూ బుధవారం నందిగామ మండల కేంద్రంలో ఆశావర్క ర్లు వినూత్న రీతిలో బిక్షాటన చేశారు. బాలితలు, గర్భిణీలు మాత శిశువుల ఆరోగ్యం కోసం ఐసిడిఎస్ ఏర్పాటు చేసి ఎనోనన సం వత్సరాల నుండి సేవలందిస్తున్న ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని ఆశావర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిత్యవసర ధరలతో ఏమి కోనలేక తినలేక దుర్భర జీవి తాలు గడుపుతున్నామని విచారం వెలిబుచ్చుతూ రహదారులపై ఉన్న హోటళ్ల వద్ద కనిపించిన వ్యక్తుల వదనద భిక్షాటన చేశా రు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల కేంద్రంతో పాటు ఆ యా గ్రామాల నుండి వచ్చిన ఆశావర్కర్లు ఉన్నారు.

# మంత్రి హరీష్‌రావు దిష్టిబొమ్మ దహనం



మంత్రి హరీష్‌రావు దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీజేపీ నాయకులు

**మెదక్ అర్బన్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సిద్ధిపేట నుండి మనోహరాబాద్ వరకు రైలు మార్గాన్ని మంగళ వారం కేంద్ర ప్రభుత్వ నిధులతో వర్చువల్‌గా ప్రారంభించిన తరుణంలో కృతజ్ఞతలు చెపాల్సింది పోయి అక్కడే ఉన్న రాష్ట్ర మంత్రి హరీష్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలు సోయి తప్పి ఇంగిత జ్ఞానం మరిచి వీధి రౌడీల్లా ప్రవర్తిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోటోలు చింపడం, టీవీలు పగలగొట్టడం సిగ్గుచేటని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గద్దం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద మంత్రి హరీష్ రావు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కడే ఉన్న బీజేపీ నాయకులు, జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డిని విచక్షణారహితంగా గాయపరచడం చూస్తుంటే నిజంగా మనం స్వతంత్ర్య భారతదేశంలో ఉన్నామా, లేక ఇంకా రజాకారుల పాలనలో ఉన్నామా అని అనిపిస్తుందన్నారు. ఈ రైల్వే నిధుల నీ మామ ఫామ్‌హౌస్‌లో పండించిన డబ్బులు కాదని, హరీష్‌రావు పొగరును దింపేరోజులు దగ్గర పడ్డాయని బీజేపీ జిల్లా అధ్యక్షులు గద్దం శ్రీనివాస్ ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గద్దం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, రామాయంపేట మండల ఇంచార్జి శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు కల్కి నాగరాజు, లోకేష్, నాయకులు సుంకోజు రాజు, ఆకుల రాములు, రాహుల్, శేఖర్, బబ్లు, ఆంజనేయులు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షులు కోణం విఠల్

## మంత్రి హరీష్‌రావును బర్తరఫ్ చేయాలి

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** సిద్ధిపేట రైల్వేలైన్ ప్రారంభోత్సవంలో ప్రధాన మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో టెలివిజన్‌ను బూటు కాలుతో తన్నిన రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావును ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేయాలని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ అన్నారు. బుధవారం సాయంత్రం పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి పదవి హోదా మరిచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఇష్టారీతిన ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే మంత్రి హరీష్‌రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు బండల శ్రావణ్, దమ్ము సాయిలు, బొగడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి ఆలయానికి లాకర్ బహూకరణ

**కొమురవెల్లి, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి హైదారాబాద్ నాచారంకు చెందిన మాజీ ధర్మకర్త ఎర్రగోళ్ల మల్లేష్ రూ. లక్ష విలువ చేసే లాకర్‌ను బుధవారం బహూకరించారు. లాకర్‌లో స్వామివారి ఆభరణాలు భద్రపరచడానికి వినియోగించనున్నారు. కార్యక్రమంలో అర్చకులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

**రాయపోల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధితో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి అన్నారు. రాయపోల్ మండలం తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి గతంలో అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా అతనికి రూ. 30 వేల సిఎం సహాయనిధి చెక్కు మంజూరైంది. బుధవారం వారికి జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి అదేశాల మేరకు చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పల్లెందర్, నాయకులు ఇప్ప దయాకర్, రాజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పద్మారెడ్డి, రఘుపతిరెడ్డి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

## అన్ని వర్గాల సంక్షేమమే సిఎం కెసిఆర్ లక్ష్యం : ఎంపిపి

**కొహెడ, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** అన్ని వర్గాల సంక్షేమానికి సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని ఎంపిపి కె.కీర్తి సురేష్ అన్నారు. మండల పరిధిలోని నాగసముద్రాల ఊర చెరువులో బుధవారం చేప పిల్లలను వదిలి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అర్థికాభివృద్ధి కోసం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. సిఎం కెసిఆర్ చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్య కారుల కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. రాబోయే రోజుల్లో సిఎం కెసిఆర్‌కు, బిఆర్ఎస్‌కు అండగా నిలుద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ ఎడి మల్లేశం, సర్పంచుల్ తైదల రవీందర్, కన్నం రాజు, ఎంపిటిసి కొడముంజ మల్లవ్వరాజు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గ్రామ అధ్యక్షులు అప్పిస చిరంజీవి, డైరెక్టర్లు చామంతుల నర్సయ్య, ప్రశాంత్, వెంకటయ్య, బైరి సాయిలు, లింగయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**కొహెడ, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** కొహెడ సింగిల్ విండో డైరెక్టర్ అరెపల్లి గ్రామానికి చెందిన బానోతు బాలు తల్లి ఇటీవల మరణించడంతో పిఎసిఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు బుధవారం పరామర్శించి ఓదార్చారు. అయనవెంట ముంజ మల్లికార్జున్, బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన నారని నర్సయ్య గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మర్కుక్ మండల బిసిసెల్‌అధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.3వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనతోపాటు బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల మహేష్, నాయకులు చెక్కల నర్సింలు, కొట్టాల నర్సింలు, మహేష్, రాజు, స్వామి ఉన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

**పిఆర్‌టియు మండల అధ్యక్షుడు వేమారెడ్డి**

**గజ్వేల్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** సుదీర్ఘ కాలం తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీ చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు పిఆర్‌టియు గజ్వేల్ మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడం అభినందనీయమన్నారు. కానీ అధికారులు బదిలీ అయిన ఉపాధ్యాయులకు సబ్‌స్టిట్యూట్ అనే నిబంధన పెట్టడం వల్ల రిలీవ్ కాలేకపోతున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్‌స్టిట్యూట్ అనే నిబంధనలు లేకుండా బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని కోరారు. ఖాళీలు ఏర్పడిన వాటిలో ప్రత్యామ్నాయంగా ఇతరులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో టీషర్ట్‌ల పంపిణీ

**వెల్దుర్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు మురళీయాదవ్ ఆదేశానుసారం మండల పరిధిలోని రామాయపల్లి, శెట్టిపల్లి, వెల్దుర్తి గ్రామంల్లో బుధవారం టిషర్ట్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయేది బీజేపీ ప్రభుతమే అని, ప్రజలు తమకు ఒకసారి అధికారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు విక్రమ్, ఆంజనేయులు, బాబు, విఠల్, యాదగిరి పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న పార్టీ శ్రేణులను ఆదుకుంటాం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి**

**కొల్చారం, అక్టోబర్4 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకుపోయి, ఆపదలో ఉన్న పార్టీ శ్రేణులను ఆదుకోవడం కోసం ముందుకు కదలినట్లు కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో ఆవుల రాజిరెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. కొల్చారంతో పాటు పోతంశెట్టిపల్లి, కొంగోడ్ గ్రామాల్లో పర్యటించారు. పోతంశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఆవుల రాజిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేశారు. అనంతరం మల్లేశంగౌడ్, రాజిరెడ్డిలు మాట్లాడుతూ పార్టీ నేతలంతా ఐకమత్యంగా ముందుకు పోయి, ఆపదలో ఉన్న పార్టీ శ్రేణులను ఆదుకోవడమే తమ ఉద్దేశం అని అన్నారు.

## వైద్యుడిపై హత్యాయత్నం కేసులో ఇద్దరు రిమాండ్

**తాండూరు, అక్టోబరు 4, ప్రభాతవార్త :**

వికారాబాద్ జిల్లా తాండూరులో నాలుగురోజుల క్రితం ఆర్ఎంపి వైద్యుడిపై గుర్తుతెలియని వ్యక్తుల హత్యాయత్నం కేసులో పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని బుదవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రావూఫ్ తెలిపారు. గతనెల 30న తాండూరులో పాత తాండూరుకు చెందిన ఆర్ఎంపి వైద్యుడు మోహినోద్దిన్‌పై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చికిత్సకోసం వచ్చి కత్తితో దాడిచేసిన విషయం తెలిసిందే. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. బుదవారం తాండూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారినుండి కత్తిన స్వాదీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు. విచారణలో భాగంగా ఆర్ఎంపి వైద్యుడు మోయినోద్దీన్ వద్దకు ఇద్దరు నిందితులు చికిత్స నిమిత్తం సంప్రదించగా వారికి కొన్ని మందులతోపాటు నిమ్మకాయ, తాయత్తు ఇచ్చాడు. మందులను వేసుకోవాలని, నిమ్మకాయను పడుకునేటప్పుడు దిండుకింద పెట్టుకోవాలని చెప్పి పంపించాడు. అయితే, వ్యాధి తగ్గకపోవడంతో ఇద్దరు వ్యక్తులు గత నెల 30న తిరిగి వైద్యుడి వద్దకు వచారు. దీంతో వైద్యుడు వ్యాధి తగ్గడానికి సమయం పగుతుందని, ఇంకా అదనంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్‌చేశాడు. దీంతో ఇద్దరు వ్యక్తులు డబులు ఇవ్వలేమని చెప్పారు. అయితే, డబ్బులు ఇవ్వకపోతే వైద్యుడు మంత్రాల ద్వార ఏదైనా హానిచేస్తాడని భయపడి కత్తితో దాడిచేశారని, వైద్యుడు గట్టిగా అరవడంతో వారు పారిపోయినట్లు విచారణలో తెలిందని ఎస్ఐ రావూఫ్ వెల్లడించారు.



వర్గల్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

## ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ

**వర్గల్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** మండల వ్యాప్తంగా బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆడపడుచులకు బుధవారం పంచాయతీ కార్యాలయాల వద్ద చీరలను ప్రజాప్రతినిధులు పంపిణీచేశారు. వర్గల్‌లోని పంచాయతీ కార్యాలయంవద్ద జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, సర్పంచ్ తూంకుంట గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పసుల రమేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలమల్లుయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి జాలిగామ లతారమేష్‌గౌడ్, సర్పంచ్ శివరాములు పాల్గొన్నారు.

**బేగంపేటలో...**



మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రవీణ్

**రాయపోల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త :** అడబిడ్డలు బతుకమ్మ పండగను సంబురంగా జరుపుకోవాలనే సిఎం కేసిఆర్ బతుకమ్మ చీరలను అందజేస్తున్నారని గ్రామ సర్పంచ్ మద్ద ప్రవీణ్ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం బేగంపేటలో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తుందన్నారు. సిఎం కేసిఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటయ్య,గ్రామ సెక్రటరీ, వార్డు మెంబర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ హయాంలోనే బేగంపేట అభివృద్ధి : జనగం శంకర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**బెజ్జంకి, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** కాంగ్రెస్ హయాంలోనే బేగంపేట గ్రామం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ మండల అధికార ప్రతినిధి జనగం శంకర్ అన్నారు. బుధవారం బేగంపేటలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బేగంపేటకు విచ్చేసిన సందర్భంగా ప్రజలను పక్కదోవ పట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బేగంపేటలో కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధిపొందిన వారున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు ఎంతో మంది సొంతింటి కల నెరవేర్చిందన్నారు. సిఎం కెసిఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు కాలగర్భంలో కలిసిపోయాయని తెలిపారు. బేగంపేటలో ఎంత మందికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారో తెలపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తిరిగి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు.సమావేశంలో పార్టీ నాయకులు అమరేందర్‌రెడ్డి, సోమరామిరెడ్డి, కొరివి లచ్చయ్య, రాజేందర్, బుర్ర తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలి



ఎమ్మెల్యేను కలిసిన బీసీ సంఘం నాయకులు

**బెజ్జంకి, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వీరాపూర్ గ్రామానికి చెందిన బీసీ సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. వెంటనే ఎమ్మెల్యే రసమయి సానుకూలంగా స్పందించి బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను బీసీ సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు చిలుముల దేవదాస్, బీసీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య, సత్యం, రాజ్‌కుమార్, రమేష్, రాజేశంగౌడ్, శ్రీనివాస్, భూమయ్య, కనకయ్య, స్వామి పాల్గొన్నారు.

## కార్మిక గర్జనను జయప్రదం చేయాలి

**భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె అశోక్**

**చేర్యాల, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న జనగామ ప్రిస్టన్ గ్రౌండ్‌లో జరగబోయే భవన నిర్మాణ కార్మికుల గర్జన సభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం చేర్యాలలోని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహాచారి, గజ్జల సురేందర్, కొమ్ముల విజయ, తిగుళ్ల కనకయ్య, బండారి సిద్దయ్య, ఎగుర్ల ఎల్లయ్య, సిద్దిరాం భద్రయ్య, బంగారు ప్రేమ్ కుమార్, గౌండ్ల కొండయ్య, వెలుగల యాదగిరి, తిగుల్ల రాకేష్, అందె కిరణ్, కోడూరి వెంకటేష్, రాములు, రాజయ్య, యాదగిరి పాల్గొన్నారు.

## సింహగర్జన ర్యాలీకి తరలివెళ్లిన ముదిరాజ్‌లు

**వర్గల్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** చట్టసభల్లో తమకు సముచిత న్యాయం ఇవ్వాలని, 10వేల కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన ముదిరాజ్‌ల సింహగర్జన ర్యాలీకి వర్గల్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ నర్సింలు ఆధ్వర్యంలో మండల ముదిరాజ్‌లు భారీఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన తమను బిసి–డి నుండి బిసి–ఏలోకి మార్చాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి మత్స్యకార సంపద కల్పించాలని అన్నారు. రాష్ట్రంలో ముదిరాజులు అణచివేతకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిసిబంధు పథకంలో తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా జనాభా దామాషా ప్రకారం మాకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 8న హైద్రాబాద్‌లో జరిగే భారీ బహిరంగసభలో తమ ఐక్యత ప్రభుత్వానికి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పసుల రమేష్, పసుల లింగం, ఎల్కంటి వెంకటేష్, నెంటూర్ నాగరాజు, జెల్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సింహగర్జనకు తరలివెళ్తున్న వర్గల్ మండల ముదిరాజ్‌లు

# మంత్రి, ఎంపిలపై కేసు నమోదు చేయాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో రైలు ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వే అధికారులతో ఇష్టానుసారంగా వ్యవహారించిన ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుతోపాటు ప్రధాని మోడీ చిత్రపటంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించి వేయాలని కోరిన మెదక్ ఎంపి ప్రభాకర్‌రెడ్డిలపై కేసులు నమోదుచేయాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్‌లో జరిగిన సంఘటనపై విచారణచేసి కేసులు నమోదు చేయాలని కోరుతూ బుధవారం సీపీ కార్యాలయంలో ఆయన బిజెపి శ్రేణులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగి 24 గంటలు పూరైన కేసు నమోదు చేయక పోవడం సరికాదన్నారు. సంఘటనపై తగిన ఆధారాలు పోలీసులకు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వమే సిద్దిపేట రైలు కలను నెరవేర్చిందన్నారు. రైల్వే స్టేషన్‌లో జరిగిన సంఘటనపై 24 గంటల్లో కేసు నమోదు చేయాలని లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల లో పార్టీ శ్రేణులతో ఫిర్యాదు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు అంబటి బాలేష్‌గౌడ్, వేణుగోపాల్, ఉపేందర్‌రావు, బైరి శంకర్ ముదిరాజ్, ఉడుత మల్లేశం యాదవ్, తోడుపూనూరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

## విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేద్దాం

**-ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ**

**గజ్వేల్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** మాదిగల విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద విశ్వరూప మహా పాదయాత్ర వాల్‌పోస్టర్లను మండల ఇన్‌ఛార్జి ఉబ్బని ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్ ఫలాలు సమాజంలో ఉన్న చిట్ట చివరి పేదవాడికి అందాలని మందకృష్ణ మాదిగ 29 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. ఈనెల 7న అలంపూర్ నుండి హైదరాబాద్ వరకు మరో చారిత్రాత్మకమైన మాదిగల విశ్వరూప మహా పాదయాత్రను ప్రారంభిస్తుండగా మాదిగ సమాజమంతా పెద్దఎత్తున తరలి రావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ, చట్టబద్దత సాధించే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతగళ్ళ లింగం, రామస్వామి, మైస బాబు, పొట్ట కరుణాకర్, కృష్ణ, బూర్గుపల్లి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-గజ్వేల్ ఏసిపి రమేష్**



అలిరాజపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసిపి రమేష్

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** విద్యార్థినీ, విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఏసిపి రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలోని సెంట్ విన్సెంట్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీమ్ ప్రాముఖ్యత, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎంతోమంది సైబర్ కేటుగాళ్ళ మాయమాటల్లో పడి ఆర్థికంగా నష్టపోయారని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించి సైబర్ నేరగాళ్ళ నుండి కాపాడుకోవాలని అన్నారు. విద్యార్థినిలు ఏదైనా ఆపద సంభవించినట్లయితే షీటీమ్‌కు సమాచారం అందించి రక్షణ పొందాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పర్చుకొని విద్యనభ్యసించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేవరెండ్ సిస్టర్ జానెట్, జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి రేషన్ డీలర్లు రుణపడి ఉంటారు

**కొమురవెల్లి, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల జెఏసి కన్వీనర్, సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మాండ్లపల్లి రవీందర్ తెలిపార బుధవారం మండలంలోని గురువన్నపేట రేణుక ఎల్లమ్మ అలయ అవరణలో సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్వర్యంలో జరిగిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో యేండ్లుగా కష్టనష్టాలను భరించి జీవనం సాగిస్తున్న రేషన్ డీలర్లను గుర్తించి కమీషన్ రూ.90 నుంచి రూ.140కి పెంచడం సంతోషంగా ఉందన్నారు. తమను గుర్తించి అండగా ఉంటామని తెలిపిన సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన తెలంగాణ రాష్ట్ర జెఏసి కన్వీనర్ రేషన్ డీలర్ల సిద్దిపేట జిల్లా అధ్యక్షులు దొమ్మాటి రవీందర్‌తో పాటు జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మాండ్లపల్లి చంద్రంను జిల్లా రేషన్ డీలర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పూడెం కృష్ణారెడ్డి, మేకల యాదగిరి పాల్గొన్నారు.

## వీర హనుమాన్ దేవాలయ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారం



వీర హనుమాన్ దేవాలయ నూతన పాలక వర్గం

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని వీర హనుమాన్ దేవాలయ నూతన పాలక మండలి చైర్మన్‌తో పాటు మరో నలుగురు సభ్యులు బుధవారం అలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. పాలక మండలి చైర్మన్‌గా అయిత రత్నాకర్, సభ్యులుగా పారుపల్లి ఈశ్వర్ చరణ్, గ్యాదరి స్వర్ణలత, బాల మల్లేశం, కటకం మోహనయ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడాల శ్రీకాంత్‌గౌడ్ నూతన పాలకవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

**కొండపాక, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** వ్యక్తిగత పరిశుభ్రతతో కొన్ని రకాల వ్యాధుల భారి నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చునని సిద్దిపేట స్ఫూర్తి లయన్స్ కబ్ల్ అధ్యక్షులు వంగ శ్రీకాంత్ అన్నారు. ఆధ్వర్యంలో బుధవారం బందారం ఉన్నత పాఠశాలలో 56 మంది విద్యార్థులకు సానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ ఎస్. సత్యనారాయణ, లయన్స్ సోమ కైలసపతి, లయన్స్ వనజ, ఎం, సత్యనారాయణ, హెచ్ఎం బి. రామ చంద్రం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాకి ఆర్థిక సహాయం

**కొండపాక, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** కొండపాక గ్రామానికి చెందిన దొమ్మట మహేష్ బుధవారం అకాల మరణం చెందాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ రూ॥ 5 వేలను పంపించి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.



చిన్నతిమ్మాపూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న దృశ్యం

## బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

**-ఏఎంసి చైర్మన్ జహంగీర్, డిసిసిబి డైరెక్టర్ అంజిరెడ్డి**

**ములుగు, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధిలో పోటీపడి అంచలంచెలుగా రూపురేఖలు మారిపోయాయని, ఇన్నేళ్ళుగా పాలించిన పార్టీలు ఈ అభివృద్ధిని చేయలేకపోయాయని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం ములుగు మండల చిన్నతిమ్మాపూర్ గ్రామంలో సిసి రోడ్లు, మినీ కూరగాయల మార్కెట్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాన్ని సర్పంచ్ హంస మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏఎంసి చైర్మన్, డిసిసిబి డైరెక్టర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సిఎం కెసిఆర్ కృషితో పదేళ్లపాలనలో 50 సంవత్సరాల అభివృద్ధిని చేసి చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమితి అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, వైస్ ఎంపిపి దేవేందర్‌రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూపాల్ రెడ్డి, రాష్ట్ర యువత విభాగం అధ్యక్షుడు జుబేర్, నాయకులు అంజన్ గౌడ్, మహేష్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లమ్మ శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్ నిమ్మకాయల గణేష్, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షుడు లింగంయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితులపై దాడులను అరికట్టాలి

**ఎంపిటిసిల రాష్ట్ర నాయకుడు దేవి రవీందర్**



ఎస్సీ ఎస్టీ నూతన చైర్మన్‌ను సన్మానించిన దేవి రవీందర్

**కొండపాక, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** ఎస్సీ, ఎస్టీ కమిషన్ నూతన చైర్మన్ బక్కి వెంకటయ్య బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపిటిసిల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టేల చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు సకాలంలో నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. ప్రతి నెల 30న సివిల్ రైట్స్ డే ను అన్ని శాఖలు కలిపి నిర్వహించేల అధికారులకు అదేశాలివ్వలని కోరారు. ఆయన వెంట సర్పంచులు బచ్చలి మహిపాల్, కిరణ్ కుమార్‌చారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం



తునికిబొల్లారంలో మహిళలకు చీరలు పంపిణీచేస్తున్న దృశ్యం

**ములుగు, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో గొప్పగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని, ఈ పండుగను ఆడపడుచులు ఆత్మగౌరవంతో జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో చేనేతలకు చేయూతనిస్తూ మరమగ్గాలపై చీరలను నేయించి పేదింటి ఆడపడుచులకు సిఎం కెసిఆర్ పెద్దన్నగా ఉండి బతుకమ్మ చీరలు పంపిణీ చేయడం అదృష్టంగా భావించాలని ములుగు ఎంపిపి ఉపాధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ పావని జగదీశ్వర్‌రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్‌లు అన్నారు. బుధవారం తునికిబొల్లారం గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ పేదింటి ఆడపడుచులకు అండగా ఉండాలనే సంకల్పంతో మహిళలకు బతుకమ్మ చీరలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, బిఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు ఘన సత్కారం

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్, రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అశీస్సులతో అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన బక్కి వెంకటయ్య రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్‌గా చైర్మన్‌గా బుధవారం హైదారాబాద్‌లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సిద్దిపేట పట్టణాకి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు సాకి అనంద్ అధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి అయనను పూలమాలలు, శాలువాలతో పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. బక్కి వెంకటయ్య రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌గా నియామకమై మంత్రి తన్నీరు హరీష్‌రావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్, గ్యాదరి భూమలింగం, మాల కుల పెద్దలు తండ భూమయ్య, దువ్వల కొమురయ్య, మద్దెల యాదగిరి తదితరులు ఉన్నారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు సాకి అనంద్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న జేఏసి నాయకులు

## 11న సంపూర్ణంగా బంద్ నిర్వహించాలి

**చేర్యాల, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈ నెల 11న నాలుగు మండలాల ప్రజలు బంద్ నిర్వహించాలని జేఏసి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని వాసవీ గార్డెన్‌లో జేఏసి నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈ నెల 11న చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళ్మిమిట్ట మండలాల ప్రజలు వాణిజ్య, వ్యాపార సంస్థలు సంపూర్ణంగా బంద్ నిర్వహించి, చేర్యాలలో బైక్‌ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

## చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్ చేయాలి



దీక్షలో కూర్చున్న దస్తావేజు లేకరుల సంఘం నాయకులు

**చేర్యాల, అక్టోబర్ 4, ప్రభాతవార్త :** చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళ్మిట్ట మండలాల దస్తావేజు లేకరుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జేఏసి నాయ కులు చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 24వ రోజుకు చేరుకోగా స్థానిక దస్థావేజు లేకరుల సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్షలో కూర్చున్నారు. వారికి జేఏసి చైర్మన్ రామగళ్ళ పరమేశ్వర్, కో చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి కండువాలు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ ఏర్పాటయ్యేవరకు మద్దతు ఉంటుందని తెలిపారు.

## బిజెపి మండల అధ్యక్షుడిగా దయానందరెడ్డి



దయానంద్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 4, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రామాయంపేట మండల అధ్యక్షునిగా పట్టణానికి చెందిన బి. దయానందరెడ్డిని నియమించారు. ఈమేరకు బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. అంతేకాకుండా మండల పార్టీ ఇంచార్జిగా తీగల శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దయానందరెడ్డి మాట్లాడుతూ గతంలో పార్టీ మండల కార్యదర్శిగా, మండల ఉపాధ్యక్షుడుగా పనిచేసిన నాకు, నాపై నమ్మకంతో మండల అధ్యక్షునిగా నియమించినందుకు పార్టీ ఎదుగుదల కోసం అహర్నిశలు పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చిమ్మనమైన శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు



అంగన్‌వాడీ టీచర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**నార్సింగి, అక్టోబరు 4, ప్రభాతవార్త :** మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లను బుధవారం ఉదయం నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 27 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు సిఐటీయు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే సభకు వెళ్తున్నట్లు తెలుసుకని వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు మాత్రం ఆ సమావేశానికి మాకు ఎలాంగి సంబంధం లేదని మమ్ములను అన్యాయంగా అదుపులోకి తీసుకున్నారని, మమ్మల్ని వెంటనే వదిలిపెట్టండని వాపోతున్నారు.

## దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు ఖాయం

**రాయపోల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త :** వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు, వీరానగర్, అంకిరెడ్డిపల్లి గ్రామాల సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలు కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు దోహదపడతాయని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సిఎం కేసిఆర్ అన్ని వర్గాల కోసం అనేక సంక్షమ పథకాలు ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. ఆసరా పింఛన్లు, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, గృహలక్ష్మి, కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ వంటి మరెన్నో పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సిఎం కేసిఆర్‌కే దక్కిందన్నారు. త్వరలో కొండపోచమ్మ సాగర్‌తో నీళ్లతో రాయపోల్ మండల చెరువులు, కుంటలు నింపుతామని వారె తెలిపారు. బిజెపి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వృద్దులకు పింఛన్ ఇవ్వడానికే ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గెలవడానికి బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ద్వంద్వవైఖరి అవలంబిస్తూ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దుబ్బాక ప్రజలు కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన అన్నారు.

## పేదల సంక్షేమమే సిఎం కెసిఆర్ లక్ష్యం

**-మున్సిపల్ చైర్మన్ రాజమౌళి**

**గజ్వేల్, అక్టోబర్ 4 (ప్రభాతవార్త):** కార్యకర్తల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి నివాసంలో ప్రజ్ఞాపూర్ 3వ వార్డుకు చెందిన మద్రి లక్ష్మి స్వామికి బిసిబంధు కింద మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో లేని సంక్షేమ పథకాలను సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టారని, అందులో భాగంగానే బిసి, మైనార్టీ బంధులు, దళితబంధు, ఆసరా పెన్షన్లు ప్రవేశపెట్టారన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం తాపత్రయపడే వ్యక్తి సిఎం కెసిఆర్ అన్నారు. బిసిలకు లక్ష రూపాయలు అందివ్వడం అభినందనీయమని, బిసి బంధు పథకం నిరంతరంగా ఉంటుందన్నారు. త్వరలో దరఖాస్తు పెట్టుకున్న అర్హులైన లబ్ధిదారులందరికీ బిసిబంధు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్, స్థానిక కౌన్సిలర్ బొగ్గుల చందు, పంబాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బిసి బంధు చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**పాపన్నపేట, అక్టోబరు 4, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మల్లంపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సైదు లక్ష్మి (30) సైదు నాగయ్యతో గత కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నాగయ్య, లక్ష్మి దంపతులు ముగ్గురు సంతానం కలిగారు. దంపతులు జీవనం సాఫీగా సాగుతుండగా ఏమి జరిగిందో తెలియదు కాని ఇద్దరి మధ్య గొడవలు పొడుచుకువచ్చాయన్నారు. మంగళవారం రాత్రి దంపతులు ఇరువురు గొడవ పడగా క్షణికావేశంలో లక్ష్మి రాత్రికి ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారులోని రెడ్డి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం లక్ష్మి కోసం గాలించగా రెడ్డి చెరువులో పడి ఆతహత్య చేసుకున్నట్లు తెలుసుకుని విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఖేడ్ డివిజన్ సమతా సైనిక్ దళ్ అధ్యక్షుల నియామకం

**నారాయణఖేడ్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ డివిజన్ సమతా సైనిక్ దళ్ అధ్యక్షులుగా టి. రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంగ్వార్ సంజీవ్‌కుమార్‌లు నియమితులయ్యారు. ఈ నియమాకం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కర్ణం రవికుమార్‌ల ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రధాన కార్యలయంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మా పైన నమ్మకంతో అధ్యక్ష, కార్యదర్శులు గా ఎన్నుకున్నందుకు జాతీయ నాయకులు డిగంబర్ కాంబ్లే, సౌత్ ఇండియా అధ్యక్షులు శ్దాన్ రేంజర్ల రాజేష్ గార్లకు, రాష్ట్ర కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నారాయణఖేడ్ డివిజన్‌కు సమతా సైనిక్ దళ్ బాధ్యతలు అప్పగించడంతో మాపైన మరిన్నిచ బరువు బాధ్యతలు పెరిగాయన్నారు. నిరంతరం పోరాడి ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మనోచేతన పాఠశాలలో అన్నదాన కార్యక్రమం



విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

**చేర్యాల, అక్టోబర్ 4, ప్రభాతవార్త** చేర్యాల పట్టణానికి చెందిన ఇప్పకాయల పవన్, నందిని ఫోటో స్టూడియో యజమాని తన తండ్రి ఇప్పకాయల నర్సయ్య 13వ వర్ధంతి సందర్భంగా స్థానిక మనోచేతన పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులకు బుధవారం అన్నదానం ఏర్పాటు చేసినట్లు పవన్ తెలిపారు.

## జహీరాబాద్ బీఎస్పీ అభ్యర్థి జంగం గోపి!

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జహీరాబాద్ శాసన సభ బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా జంగం గోపి దాదాపుగా ఖరారయినట్లు తెలుస్తోంది. గత శాసన సభ ఎన్నికల్లో జంగంలో గోపి జహీరాబాద్ నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి 18వేల ఓట్లు దక్కించుకున్నారు. పలు కారణాలతో జంగం గోపిని బిజెపి నుంచి పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేయడంతో జంగం గోపి బీఎస్పీ జాతీయ కో-ఆర్డినేటర్ ఎంపీ రాంజీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ల సమక్షంలో ఈ నెల 2వ తారీఖున బీఎస్పీలో చేరిన విషయం పాఠకులకు విధితమే. బీఎస్పీ పార్టీ అవకాశం కల్పిస్తామని రాంజీ గౌతమ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు హామి చేయడంతో జంగం గోపి బీఎస్పీలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది.

## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ జిల్లా యూనియన్ సభ్యురాలు పద్మ అన్నారు. బుధవారం భాగ్యనగరంలో నిర్వహించే సభకు వెళ్తుండగా చిన్నశంకరంపేట పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో పనిచేసే అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి కీలకమన్నారు. అయినా కూడ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదన్నారు. అడిగిన ప్రతిసారి కేంద్ర ప్రభుత్వం చేయాలనడం సరికాదన్నారు. పదవివిరమణ పొందిన అంగన్‌వాడీలకు రూ.10లక్షలను అందించాలని, వయోపరిమితి 65 పెంచినప్పటికి 60గానే ఉంచాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల అంగన్‌వాడి కార్యకర్తలు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడి రాజీనామా

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో ప్రతిభకు, సామర్థ్యానికి తగిన గుర్తింపు లేదని పార్టీ మండలాధ్యక్షుడు పోతరాజు రమణ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు లేకపోవడం బాదాకరమని జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి రాజీనామాను జీర్ణించుకోలేకపోతున్నామని, కష్టాల్లోన్న ఉన్న పార్టీకి పేరు తెచ్చిపెట్టిన నాయకుడిని పార్టీ అధిష్టానం పక్కన పెట్టడం పార్టీకే తీవ్ర నష్టమన్నారు. ఈ సందర్భంగా తన మండలాధ్యక్ష పదవికి రాజీనామ చేస్తున్నట్లు ఆయన వివరించారు. నియోజకవర్గం నుండి కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి టికేట్ ఇవ్వకుండా ఇతరులకు టికెట్ ఇస్తే కచ్చితంగా ఓడిపోవడం ఖాయం అని అన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని పార్టీ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు అన్నారు. బుధారం చిన్నశంకరంపేట పట్టణంలో యువతకు క్రీడా కిట్టను, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. క్రీడల్లో రాణించిన యువతకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గ్రామీణ యువతలోని ప్రతిభను వెలికితీయడానికే ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. యువతకు ఉచిత శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చినవారిని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆడించేందుకు ప్రభుత్వం చేయుతను అందిస్తుందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రవీణ్, మాజీ సర్పంచి కుమార్ గౌడ్, చంద్రం, స్వామి, రాధక్రిష్ణ పాల్గొన్నారు.

### ఈ నెల 27న జైపూర్ రంగ్‌వార్షికోత్సవ్ ప్రారంభం

భారతదేశంలో హ్యాండ్‌మేడ్ రగ్గుల తయారీలో ప్రఖ్యాతి గాంచిన జైపూర్ రగ్స్ వార్షిక రంగ్ ఉత్సవ్‌ను ఈ నెల 27వ తేదీన ప్రారంభించనున్నట్లు జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. ఈ సంవత్సరం రగ్ ఉత్సవ్ వినియోగదా రులకు అసాధరణమైన అనుభ వాన్ని అందిస్తున్నందన్నారు. ప్రత్యేక తగ్గింపులు, నేత కార్మికులతో ఇంటరాక్టివ్ సెషన్‌లు జేఆర్ మెరిటోరియస్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్లు ఉన్నాయి.

# సంగారెడ్డిలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం




వయోవృద్ధులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి హనుమంతరావు

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో బుధవారం జిల్లా మమిళా, శిశు సంక్షేమం, వయో వృద్దుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్దుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీగలన సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి జె హనుమంతరావు హాజరై వయో వృద్దులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రోజులు గడపాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సమాజానికి దిశా నిర్దేశం చేసేది వృద్దులే అన్నారు.

### వయో వృద్ధులకు సూచనలు చేసిన న్యాయమూర్తి

వృద్దులను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సంక్షేమమ లక్ష్యంగా కుటుంబ సభ్యులు చూసుకోవాలని సూచించారు. వృద్దాశ్రమంలో వయో వృద్దులు సంతోషంగా తమకు నచ్చిన రీతిలో బతికేలా మార్గాన్ని నిర్దేశించుకోవాలన్నారు. వయో వృద్దుల పోషణ సంక్షేమ చట్టం-2007 కల్పిస్తుందని గుర్తు చేశారు. డిఆర్‌ఓ నగేష్ మాట్లాడుతూ నేటి యువతకు వయో వృద్దులు మార్గనిర్దేశనం చేయాలన్నారు. వృద్దుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అన్ని రకాలుగా సహకరిస్తుందన్నారు. జిల్లాలో 4 సీనియర్ సిటీజన్స ట్రిబ్యునల్స్‌లు ఉన్నాయని, ఎవరికైన ఇబ్బందులు కల్గితే ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించాలని సూచించారు. వృద్దుల పట్ల నిర్లక్ష్యంగా వహించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సీనియర్ సిటీజన్స్ సహాయార్థం తెలంగాణ ప్రభుత్వం హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14567ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి సంధ్యారాణి, డిఎంఅండ్‌హెచ్‌లో డాక్టర్ గాయత్రి దేవి, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిడి అఖిలేష్‌రెడ్డి, సిడిపిఓలు, వయో వృద్దుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, వయో వృద్దులు పాల్గొన్నారు.



మెటల్‌కుంటలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

## ఉద్యమ ద్రోహులతో తెలంగాణ పాలన

**-మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్‌రావు**

**న్యాల్‌కల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణలో ప్రజల బతుకులు మారుతాయని ఆశించి సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ ఇస్తే ఉద్యమ ద్రోహులు తెలంగాణను పాలిస్తే ప్రజల బతుకులు ఎలా మారుతాయని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య సమన్వయకర్త డాక్టర్ ఏ చంద్రశేఖర్ ప్రశ్నించారు. వస్తున్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మూడవ రోజైన బుధవారం మండలంలోని మిర్జాపూర్, ఖలీల్‌పూర్, రేజింతల్, బసంత్‌పూర్, మెటల్‌కుంట గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మొదటి ప్రధాన్యతగా మండలంలోని మెటల్‌కుంట, బసంత్‌పూర్ గ్రామాల వరకు రోడ్డు సౌకర్యం మెరుగు పరుస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు ఇప్పుడు కేసిఆర్ వెంట లేరన్నారు. కల్లబొల్లి మాటలతో కేసిఆర్ ప్రజలను మోసపుచ్చుతూ వస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే 6 హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సిద్దిలింగయ్య స్వామి, ఝరాసంగం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండంగారి తిరుపతిరెడ్డి, నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, నాయకులు కండెం నర్సింలు, శంకర్‌పాటిల్, నర్సింహారెడ్డి, శ్యామేల్, అప్పారావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్

**హుస్నాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త** గిరిజన అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హుస్నాబాద్ పర్యటనతో పాటు మంగళవారం రోజున సిద్దిపేట రైల్వే స్టేషన్‌లో మంత్రి హరీష్‌రావు, బిఆర్ఎస్ నాయకులు ప్రవర్తించిన తీరు బిజెపి నాయకులపై చేసిన దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేయకుండా బుదవారం ఉదయం హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి నాయకులకు పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకురాలు కర్ణకంటి మంజులరెడ్డిలు అంతక ముందే అరెస్ట్ అయిన ఆశా వర్కర్లను పరామర్శించి వారి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, అక్కన్నపేట మండల అధ్యక్షులు గొల్లపల్లి వీరాచారి, హుస్నాబాద్ మండల అధ్యక్షులు చెక్కబండి విద్యాసాగర్‌రెడ్డి, ఎస్టిమోర్చ జిల్లా అధ్యక్షులు నునావత్ మోహన్‌నాయక్, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి మంజులరెడ్డి, ఒబిసి మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి సతీష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## న్యాల్‌కల్‌లో బిక్షాటన చేసిన ఆశవర్కర్లు



న్యాల్‌కల్‌లో భిక్షాటన చేస్తున్న ఆశ వర్కర్లు

**న్యాల్‌కల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టింపులేకపోవడాన్ని నిరిస్తూ బుధవారం ఆశ వర్కర్లు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని వ్యాపార సముదాయాల్లో, రోడ్లపై వెళుతున్న ప్రజల వద్ద బిక్షాటన చేశారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్లు అమృతా, లక్ష్మి, కల్పన, రేణుకలు డిమాండ్ చేశారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**న్యాల్‌కల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో మండలంలోని మల్గి గ్రామ శివారులోని కొండగట్టుపై కొలువున్న శ్రీ నవనాథ్‌సిద్దేశ్వర ఆలయానికి బుదవారం సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎంజీఎన్ఆర్జిఎస్ పథకంలో 5 లక్షలు, దాతల సహకారంతో150 మీటర్ల మే సిసి రోడ్డు నిర్మాణం పనులకు గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు జెట్‌గొండ మారుతి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, వార్డు సభ్యులు , ఆలయ కమిటి అధ్యక్షులు సిద్దారెడ్డి, విఠల్, యువజన నాయకులు రమేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



నవనాథ్ సిద్దేశ్వర ఆలయానికి సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మారుతి



మాట్లాడుతున్న బిజెపి జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు మల్లారెడ్డి

## అధికారం శాశ్వతం కాదు.. దాడికి ప్రతిదాడి తప్పదు

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదని, అధికారం ఉందికదా అని దాడులకు పాల్పడితే ప్రతి దాడి తప్పదని బిజెపి జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి, మండలాధ్యక్షుడు పట్లోరి పోగుల రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన స్థానిక విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న రవాణా సౌకర్యాలు, పథకాలు బిఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తుందనడం సిగ్గు చేటని, మంగళవారం సిద్దిపేట జిల్లాలో రైలు ప్రారంభోత్సవ సభలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అత్యుత్సాహం చూపించారని, నరేంద్ర మోడి చిత్రపటాన్ని చింపేయడం సరికాదన్నారు. మోదీ ప్రసంగిస్తున్న విడియో టీవిలో రావడంతో మంత్రి హరిష్ రావు ఆవేశంతో టీవిని తన్నడం హేయమైన చర్యఅని అన్నారు. దాడులకు పాల్పడితే దాడికి ప్రతి దాడి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, దశరథం, రాజు, మధు, స్వామి, శ్రీను, వెంకటేశంలు పాల్గొన్నారు.

## ప్రతిఘటనల మధ్య ప్రారంభమైన నీమ్జ్ రోడ్డు పనులు

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండలంలోని హుగ్గెల్లి చౌరస్తా నుంచి నీమ్జ్ ప్రాంతమైన ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను వారం రోజుల క్రితం రైతులు అడ్డుకోగా బుధవారం అధికారులు పోలీసుల సహకారంతో ఇరిగి రోడ్డు పనులు ప్రారంభం అయ్యేలా చేశారు. తమ భూములకు నాన్ అగ్రికల్చర్‌గా గతంలోనే చేయించామని, అందుకు అనుగుణంగా తమకు నష్టపరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తూ రోడ్డు పనులను అడ్డుకున్న విషయం పాఠకులకు విధితమే. అధికారుల నుంచి నష్టపరిహారం విషయంలో సానుకూలంగా స్పందించకపోవడంతో భూ యజమానులు జి చంద్రకాంత్ కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. హై కోర్టులో కేసు నడుస్తుండగానే తమ భూమిలో రోడ్డు పనులు ఎలా నిర్మిస్తారని రైతులు నీమ్జ్ ప్రత్యే అధికారిణి రాధాబాయిని, ఆర్‌డిఓ మహిపాల్‌రెడ్డిలను ప్రశ్నించారు. గురువారం హైకోర్టు తీర్పును వెలువరిస్తుందని, అంత వరకు నిర్మాణ పనులు నిర్మించడం చట్ట విరుద్ధమవుతుందని, కోర్టును దక్కిరించినట్లవుతుందని రైతులు గుర్తు చేస్తున్నారు. కోర్టు తీర్పుకు అనుగుణంగా నష్టపరిహారం అందిస్తామని, నిర్మాణ పనులను అడ్డుతగలవద్దని అధికారులు రైతులకు సూచించడంతో రైతులు నిరసనకు స్వస్తి పలికారు. రోడ్డు నిర్మాణం సందర్భంగా ఎలాంటి అలజడులు జరగకుండా పట్టణ సిఐ బి రాజు, రూరల్ ఎస్ఐ సిహెచ్ ప్రసాద్‌రావు, పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు.

## టిఆర్ఎస్ ప్రభుత్వానికి మాటల్లో కాదు చేతల్లో బుద్ది చెపుతాం

**కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి అనుమంతరావు**



మాట్లాడుతున్న మైనంపల్లి హనుమంతరావు

**కౌడిపల్లి, అక్టోబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వానికి మాటలతో కాదు చేతల్లో బుద్ది చెప్తామని కాంగ్రెస్ నాయకులు మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనం పల్లి హనుమంతరావు తెలిపారు. బుధవారం రోజున మైనపల్లి హనుమంతరావు వారి కుమారుడ రోహిత్ ఏడుపాయల నవదుర్గా మాతను దర్శించుకునేందుకు వెళ్తుండగా మండల కేంద్రమైన కౌడిపల్లిలో రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో వాణాసంచా పేల్చి ఘనంగా స్వాగతం పలికారు . ఆవుల రాజిరెడ్డి మైనంపల్లి హను మంతరావును కుమారుడు రోహిత్‌లను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మాటల్లో కాకుండా చేతల్లో తగిన బుద్ధి చెప్తామని హనుమంతరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి దోచుకుంటుందన్నారు. మరొక్కసారి టిఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇస్తే ప్రభుత్వ ఆస్తులను అమ్మడమే కాకుండా ప్రజ లపై ఉన్న బట్టలను కూడ అమ్మేస్తారని తెలిపారు. గ్రామంలో 100 మంది ఉంటే వారి పార్టీ కార్యకర్తలకు ఇద్దరికి మాత్రమే ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తున్నారని మిగిలిన 98 మంది ఏంపాపం చేశారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆరున్నర కోట్ల రూపాయల అప్పు చేయడం జరిగిందని సగటున ఒక్కరిపైన 1,50,000 రూపాలయల అప్పు ఉన్నదని తెలిపారు. ప్రజలు గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్‌సిం గ్ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌటకూరులో ఆశల బిక్షాటన

**చౌటకూరు, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో బుధవారం ఆశా వర్కర్లు భిక్షాటన చేసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు 18వేల రూపాయల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, సువర్ణ, రమాదేవి, పరంజ్యోతి, సునీత పాల్గొన్నారు.

## కోడూర్‌లో కాంగ్రెస్ మెనిఫెస్టో ఆవిష్కరణ

**పుల్కల్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** మండలంలోని కోడూర్ గ్రామంలో బుధవారం మాజీ డిప్యూటీ సిఎం దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు కాంనరగెషన నాయకులు కాంగ్రెస్ మెనిఫెస్టోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రవీందర్, కోడూర్ అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి అనంతరావు, ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంజయ్య, వెంకట్‌రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రుబినా నజీబ్

## ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

**నారాయణఖేడ్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు నారాయణఖేడ్ మున్సిపల్ ఛైర్మన్ రుబినా నజీబ్ ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తున్నందున డాక్టర్లు ఎల్లప్పుడు రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని వార్డులు పరిశీలించి వైద్య సేవలు ఎలా జరుగుతున్నాయని రోగులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏనిమిదవ వార్డుకు చెందిన కిష్టయ్య కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలియడంతో ఆయన ఆరోగ్యం గురించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సీజన్‌లో డెంగ్యూ జ్వరాలతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారని అందుకు బయపడాల్సిన పనిలేదన్నారు. డాక్టర్లు వైద్యసిబ్బంది ఎల్లప్పుడు ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

## శాలువాతో సన్మానం చేసిన ఫోటో, వీడియో గ్రాఫర్ల సంఘం

**దుబ్బాక, (అక్బర్‌పేట భూంపల్లి) అక్టోబర్ 4, ప్రభాతవార్త:** అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని పోలీస్ స్టేషన్ కి ఇటీవల వచ్చిన ఎస్ఐ భూవనేశ్వరావుని మండల ఫోటో, వీడియో గ్రాఫర్ల సంఘం భూవనేశ్వరావుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేశారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే ఫోటో ఎక్స్పో పోస్టర్ని ఆవిష్కారణ చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యవర సభ్యులు పుట్ట నాగరాజు, కరుణాకర్, మధు, రాజశేకర్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**దుబ్బాక, (అక్బర్‌పేట భూంపల్లి) అక్టోబర్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్నుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బుధవారం నూతన పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా అక్బర్‌పేట భూంపల్లి మండలం నుండి మండల అధ్యక్షుడు జిడిపల్లి రవి, పిఎస్‌సిఎస్ షేర్ల కైలసం, జిల్లా బిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ఎల్లా రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మండల కుమార్, అగ్రహారం, కూడవెల్లి గ్రామ సర్పంచ్ సుగుణ, చిట్టాపూర్ గ్రామ సర్పంచ్ పోతనక రాజయ్య, నాయకులు బండి రాజు, జిడిపల్లి కిషన్, జిడిపల్లి శ్రీనివాస్, ఆరుట్ల శ్రీనివాస్, నర్సింలు, కొత్త కిషన్ రెడ్డి, సంజీవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎంపిటిపి ఆస్క రవి, మనోహర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, పోతరెడ్డిపేట గ్రామ సర్పంచ్ శంకర్, పల్లె సుదర్శన్, శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు ర్యాలీగా హైదరాబాద్ కు బయలుదేరడం జరిగింది.

## కాంగ్రెస్ పార్టీని వీడకండి

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు పార్టీని విడటం సరికాదని, ఇప్పుడిప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌గౌడ్, జిల్లా నాయకుడు మోహన్ నాయక్‌లు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు పోతరాజు రమణలు ఇలా రాజీనామాలు చేసుకుంటూ పోతే పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. పార్టీని గెలిపించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఎన్నికల వేళ కష్టపడి పనిచేయాలన్నారు.

## జహీరాబాద్‌లో ఓటు హక్కుపై అవగాహన

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఓటు హక్కుపై స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యలో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒకరు ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పట్టణ మిషన్ కో-ఆర్డినేటర్ బస్వన్త్‌రెడ్డి తెలిపారు. వంద శాతం ఓటు నమోదు అయ్యేలా ఎవరికి వారు తమ వంతు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొన్నారు.

## ఒకసారి అవకాశమివ్వండి సంగతేంటో చూపిస్తా

**బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి**

**హుస్నాబాద్, అక్టోబరు4, ప్రభాతవార్త** హుస్నాబాద్ నియోజవర్గ ఓటర్లు తనకు ఈ సార్వత్రిక ఎన్నికల్లో అవకాశమిస్తే హుస్నాబాద్ అభివృద్ధి పంగతేందో చూపిస్తానని హుస్నాబాద్ నియోజకవర్గ బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు జన్నపురెడ్డ సురేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత రెండుమార్లు హుస్నాబాద్‌లో స్థానికేతరుడైన అభ్యర్థికి అవకాశం కల్పిస్తే అతను వరంగల్ టు హుస్నాబాద్‌కు అప్‌అండ్‌డౌన్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని సురేందర్‌రెడ్డి అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కసారి బిజెపికి అవకాశం కలిస్తే అభివృద్ది అంటే ఎంటో చూపిస్తానన్నారు.

## గీత పారిశ్రామిక సంఘం నూతన కమిటి ఎన్నిక

**అక్కన్నపేట, అక్టోబరు4, ప్రభాతవార్త** గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షులుగా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన తాళ్లపలి మల్లేశం ఎన్నికయ్యారు. బుధవారం రోజున మండల కేంద్రంలో గీత పారిశ్రామీక సహకార సంఘం జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా మల్లేశం, ఉపాధ్యక్షులుగా కొయ్య ృడ సదయ్య, డైరెక్టర్లుగా మాచర్ల రవిందర్, లక్ష్మి, మంద కళావతీలను ఎన్నికలు నిర్వహించి ఎన్నుకున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో సంఘం అభివృద్ధి, సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కొరకు ఉద్యమాలు చేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో జర్నలిస్టు మృతి

**జహీరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** సెప్టెంబరు 21వ తారీఖున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు నాగయ్య బుధవారం ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. నియోజకవర్గంలోని ఝరాసంగం మండలం ప్యాలవరం గ్రామానికి చెందిన నాగయ్య పలు దిన పత్రికలలో విలేఖరిగా విధులు నిర్వహించారు. జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురైన నాగయ్య హైద్రాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ బుధవారం తెల్లవారు జాము కానరాకుండా పోయాడన్నారు. నాగయ్య మృతి పట్ల ఆయా పార్టీల నాయకులు, అధికారులు, జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. బుధవారం సాయంత్రం స్వగ్రామంలో నాగయ్యకు కన్నీటి వీడ్కోలు పలికారు.

### కాంట్‌వెయిట్ టు వింటర్ ప్రచారాన్ని ప్రారంభించిన అబుదాబి

అబుదాబి సాంస్కృతిక అండ్ పర్యాటక శాఖ డెస్టినేషన్ బ్రాండ్ ఎక్స్పిరియన్స్ అబుదాబి కాంట్ వెయిట్ టు వింటర్ శీర్షికన అంతర్జాతీయ ప్రచారాన్ని ప్రారంభించింది. వెనువెంటనే కార్యక్రమాలతో మరపురాని అనుభూతిని కలిగిస్తూ పరిపూర్ణ వాతావరణంతో కలిపి ప్రతి ఒక్కరి ఆసక్తులను తీర్చుకునేలా కార్యక్రమాలను అంబుబాటులోకి తీసుకు రానున్నామనే వాగ్దానాన్ని ఇదిఇస్తుంది.